క్లుప్తంగా

బాలాత్రిపుర సుందరి అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో వెలసి ఉన్న బాలాత్రిపురసుందరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం, పూజలు, భజనలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన


స్వామివారికి హారతి ఇస్తున్న దృశ్యం

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో వెలసి ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

వైభవంగా కోటమ్మ గ్రామోత్సవం


తిన్నెలపూడిలో కోటమ్మ గ్రామోత్సవం

కోట : మండలంలోని తిన్నెలపూడిలో శుక్రవారం ప్రజల ఆరాధ్యదైవం కోటమ్మ గ్రామ పొంగళ్లు వేడుకగా నిర్వహించారు. అమ్మవారి నిలుపు, శిలాప్రతిష్ఠ అనంతరం గ్రామస్తులు సామూహికంగా పొంగళ్లు పెట్టారు. సకాలంలో వర్షాలు కురవాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం అమ్మవారిని ఘనంగా ఊరేగించారు. ఇంటి ముంగిటకు వచ్చిన అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించారు.

ఉపాధి పనుల పరిశీలన


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రేమ్‌రాజ్ కుమార్

నాయుడుపేటటౌన్ : మండలంలోని పూడేరు, గొట్టిప్రోలు, అరవపెరిమిడి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం స్థానిక ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్ పరిశీలించారు. నిబంధనల మేరకు నిర్దేశించిన కొలతలతో పనులను చేయాలని కూలీలకు సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, టార్పాలిన్ పట్టలు, మెడికల్ కిట్ అందుబాటులో ఉండాలన్నారు.

దాడి కేసులో ముగ్గురు యువకుల అరెస్టు


యువకుల అరెస్టు చూపుతున్నట్టు ఎస్‌ఐ అంజిరెడ్డి

చిల్లకూరు : మండలంలోని చింతవరంలో ఎరువుల దుకాణం నిర్వహిస్తున్న గోపాల్‌పై ఇటీవల దాడికి పాల్పడిన ముగ్గురు యువకులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ అంజిరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 13వ తేదీన గోపాల్‌కు, చింతవరం కొత్తపాళెం గ్రామానికి చెందిన క్రాంతి, దిలీప్, చెంచయ్య మధ్య చిన్న పాటి వివాదం నెలకొంది. అక్కడ ఉన్న వారు వారిని సర్దిచెప్పడంతో అందరూ ఇళ్లకు వెళ్లిపోయారు. 14వ తేదీన గోపాల్ దుకాణంలో ఉండగా ముగ్గురు యువకులు అక్కడకి బైక్‌పై వెళ్లి దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన గోపాల్‌ను స్థానికులు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురు యువకులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

19 నుంచి పెంచలకోనలో బ్రహ్మోత్సవాలు


పెంచలకోన క్షేత్రం

రాపూరు: చుట్టూ పచ్చని కొండలు.. దట్టమైన అడవి.. ఆహ్లాదకర వాతావరణంలో పెంచలకోన లక్ష్మీ నరసింహస్వామి కొలువయ్యాడు. ఇక్కడ దేశంలో ఎక్కడా లేనివిధంగా నృసింహుడు, చెంచు లక్ష్మీ దేవి ఏక శిలలో పెనవేసుకుని స్వయంభువుగా వెలశారు. అందుకే ఈ స్వామికి పెనుశిల నరసింహ స్వామి అని పేరు వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. నెల్లూరుకు 80 కిలోమీటర్ల దూరంలో రాపూరు మండలంలో సముద్ర మట్టానికి 3 వేల కిలోమీటర్ల ఎత్తులో తూర్పుకనుమల్లో కణ్వనది పరివాహక ప్రాంతంలో ఈ క్షేత్రం ఉంది. పెనుశిల కోన కాలక్రమేణా పెంచలకోనగా మారింది. ఈ క్షేత్రానికి 1809లో హంటన్‌డొర 200 ఎకరాల అటవీ ప్రాంతాన్ని ధారాదత్తంచేసినట్టు రికార్డులు ఉన్నాయి.

పెంచలస్వామికి పేర్లు ఎన్నో

పెంచలకోన క్షేత్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామిని పెంచలస్వామి, పెనుశిల స్వామి, నరసింహస్వామి, లక్ష్మీ నరసింహస్వామి, చత్రవట నరసింహుడు, కొండి కాసులవాడు ఇలా పలు పేర్లతో పిలుస్తారు.


స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు

క్షేత్ర విశేషాలు

తిరుమల నుంచి శ్రీశైలం వరకు ఉన్న ఒకే కొండ మధ్యభాగంలో పెంచలకోన కొండలు ఉన్నాయి. ఇక్కడి కొండ రెక్కలు విప్పినట్లు గరుడ ఆకారంలో ఉంటుంది. పెంచలకోన క్షేత్రంలోని గర్భగుడిని ఎప్పుడు నిర్మించారో ఆధారాలు లేవు. సుమారు 800 సంవత్సరాల క్రితం నిర్మించినట్టు స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ సప్తతీర్థాలు ఉన్నాయి. కొండ మీద నుంచి కోనకు చేరుకునే వరకు ఏడు నీటి గుండాలు ఉన్నాయి. ఈ గుండాల్లో స్నానమాచరిస్తే అన్ని దోషాలు పోయి పరిపూర్ణమైన ఆరోగ్యం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం.

19 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఈ క్షేత్రంలో ప్రతి ఏటా వైశాఖ శుద్ధ ఏకాదశి మొదలు వైశాఖ శుద్ధ విదియ వరకు 6 రోజులు బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది 19వ తేదీ (ఆదివారం) నుంచి 25వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయి. ఆదివారం ఉదయం ఉత్సవమూర్తులు గోనుపల్లినుంచి పెంచలకోనకు చేరుకుంటారు. ఆ రోజు రాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. 20వ తేదీ ధ్వజారోహణం, రాత్రి 10 గంటలకు శేషవాహనం నిర్వహిస్తారు. 21న ఉదయం హంస వాహనం, రాత్రి 10 గంటలకు హనుమంత వాహనం ఉంటాయి. 22న ఉదయం 8 గంటలకు సింహ వాహనం, రాత్రి 11 గంటలకు గరుడ వాహనం సేవ చేస్తారు. 23న ఉదయం స్వామి, అమ్మవార్ల కల్యాణం, రాత్రి రథోత్సవం, గజా వాహన సేవ ఉంటాయి. 24న ఉదయం చక్రస్నానం, రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం, 9 గంటలకు అశ్వ వాహనం 11 గంటలకు ధ్వజావరోహణం చేస్తారు. 25న స్వామి, అమ్మవార్లు గోనుపల్లికి వేంచేస్తారు. అనంతరం క్షేత్రోత్సవం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

కణ్వమహర్షి ఆశ్రమం

ఈ క్షేత్రంలో కణ్వమహర్షి తపస్సు చేశారని, అందువల్లే ఇక్కడ నదికి కణ్వనది అని పేరు వచ్చినట్టు పురాణ గాథ ఉంది. తర్వాత ఈ నదికి కండ్లేరు, కండలేరుగా మారినట్టు స్థానికులు చెబుతున్నారు. కండలేరు వద్ద జలాశయం నిర్మించారు. ఈ జలశయం ద్వారా నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు తాగు, సాగు నీటితోపాటు చెన్నై నగర ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు.

గొల్లబోయికి తొలిదర్శనం

పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి గ్రామానికి వచ్చిన తొలిసారి గొర్రెలకాపరికి గొల్లబోయిడికి దర్శనం ఇచ్చారు. అందువల్లే ఏటా జరిగే బ్రహ్మోత్సవాల్లో కోనకు బయలుదేరే స్వామివారికి గ్రామ సమీపంలోని గొల్లబోయిని ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు.


ఆదిలక్ష్మీదేవి ఆలయం వద్ద ఉన్న వటవృక్షం


శ్రీవారి పుష్కరిణి

ఉపాధి పనుల్లో అవకతవకలపై ఫిర్యాదు

పెళ్లకూరు: ఉపాధిహామీ కింద చేపట్టిన పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలకు పాల్పడినట్టు కూలీలు శుక్రవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని శిరసనంబేడు గ్రామంలో నాలుగు వారాలుగా క్యాటిల్‌పాండ్ పనులు చేస్తున్నారు. ఖాతాల్లో వేతనాలు జమ కాకపోవడంతో కూలీలు శుక్రవారం పెళ్లకూరులోని ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఉపాధి ఏపీవో ధయానంద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అధికారులు రికార్డులు పరిశీలించడంతో రోజుకు 60 మంది పనులు చేస్తుంటే మస్టర్లలో 250 నుంచి 325 మందికి పైగా నమోదు చేసినట్టు గుర్తించారు. ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు, వ్యాపారులు, భూస్వాముల పేర్లు కూడా మస్టర్లలో ఉన్నట్టు తేలింది. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లత నాయుడుపేటలోని ఒక ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తుండడంతో ఆమె భర్త మల్లికార్జున్ ఇక్కడ ఫీల్డ్ అసిస్టెంట్‌గా కొనసాగుతున్నట్టు గుర్తించారు. మల్లికార్జున్ గత టీడీపీ ప్రభుత్వంలో సస్పెండ్ అయి రూ.2 లక్షలకు పైగా రికవరీ కూడా చెల్లించాల్సి ఉంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎఫ్‌ఏ అవినీతి అక్రమాలకు అడ్డులేకుండా పోయిందని స్థానికులు ఆరోపించారు. ఉపాధి కూలీలు భాస్కర్, గురవయ్య, వెంకటసుబ్బయ్య, జయమ్మ, సునీత, ధయాకర్, సుజతమ్మ, ప్రమీలా, లక్ష్మమ్మ, శ్రీనివాసులు, విజయ, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.


ఫీల్డ్ అసిస్టెంట్‌పై అధికారులకు ఫిర్యాదు చేస్తున్న కూలీలు

పూర్వ విద్యార్థుల సమావేశం


పిగిలాం పాఠశాల ఉపాధ్యాయులకు ప్రింటర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

బాలాయపల్లి(సైదాపురం) : వారంతా మళ్లీ చిన్న పిల్లలుగా మారారు. తరగతి గదిలో అల్లరి చేశారు. పాఠశాల ఆవరణలో తిరుగుతూ సందడి చేశారు. తమతో కలిసి చదువుకున్న స్నేహితుల సరదాగా గడిపారు. ఇందుకు బాలాయపల్లి మండలంలోని పిగిలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా మారింది. పిగిలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–2005 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన వారు శుక్రవారం సమావేశమయ్యారు. ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమ ఉన్నతికి కృషి చేసిన ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులకు సన్మానించి రూ.18 వేలు విలువ చేసే ప్రింటర్‌ను బహూకరించారు. వారు మాట్లాడుతూ సుమారు 20 ఏళ్ల తరువాత అందరూ మళ్లీ కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. చదువుకున్న పాఠశాల తల్లితో సమానమని, ఎవ్వరూ మరవకూడదన్నారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటును అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని పాల కేంద్రం సమీపంలో ఉన్న 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లు, మరమ్మతులు చేస్తుండడంతో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈ రవిమునిచంద్ర తెలిపారు. ఈ నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటగిరి పట్టణం, రూరల్, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు

గూడూరులో..

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు డీఈఈ ప్రసాద్ కోరారు. పట్టణంలోని నెల్‌క్యాస్ట్, గాంధీనగర్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ట్రీ కటింగ్‌తో పాటుగా మరమ్మతులు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1–30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు. .

వెంకటగిరిలో వర్షం

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరిలో శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని మోస్తరు వర్షం కురిసింది. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు వర్షంతో కొంచెం ఉపశమనం పొందారు. వర్షానికి పొలాలను దున్నుకుని నారుమడులు వేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

కండలేరులో 6.765 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.765 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 30 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

- హుందా రాజకీయాలు చేద్దాం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్

గూడూరు రూరల్ : ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడినట్లు అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ తెలిపారు. ఆయన శుక్రవారం గూడూరులోని సనత్ నగర్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో చిల్లకూరు, గూడూరు నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ అసత్య ఆరోపణలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో చిల్లకూరులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు 200 మందికి పైగా వచ్చి రౌడీ రాజకీయం చేశారని తెలిపారు. బాటిళ్లలో డీజిల్, పెట్రోల్ తీసుకువచ్చి మీద చల్లి అలజడి సృష్టించారని తెలిపారు. ఇప్పుడు ఆ సంఘటనను వైఎస్సార్ సీపీకి ఆపాదించి రాజకీయంగా లబ్ధిపొందాలని చూడడం దారుణమన్నారు. చింతవరంలో జరిగిన వ్యక్తిపై దాడికి కూడా స్థానిక నాయకుడు విష్ణువర్ధనరెడ్డి కారణమని పోలీసులు కేసు నమోదు చేశారని గుర్తు చేశారు. ఆ కేసుకు సంబంధించి ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేశారని పేర్కొన్నారు. సునీల్‌కుమార్‌కు రాజకీయ భిక్ష పెట్టింది వైఎస్సార్‌సీపీ కాదా అని నిలదీశారు. అప్పట్లో మీరు గెలిచేందుకు, అటు తరువాత మీతో కలిసి ఉన్న విష్ణువర్ధన్‌రెడ్డిని రౌడీ షీటర్ అని అనడాన్ని బట్టి చూస్తుంటే గురివింద సామెత గుర్తుకు వస్తుందన్నారు. మీరు అధికారంలో ఉన్న సమయంలో నకిలీ అట్రాసిటీ కేసులు నమోదు చేయించి బెదిరించలేదా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో వరప్రసాద్ ఎమ్మెల్యేగా ఉన్నా ఎప్పుడూ ఇలాంటి కేసులు నమోదు కాలేదన్నారు. త్వరలోనే ఆలీబాబా 40 దొంగల బండారం బయట పెడతామని హెచ్చరించారు. ఎంత మందిని మోసం చేశావో అందరికీ అర్థమయ్యేలా చేస్తామని వెల్లడించారు. ఇకనైనా అసత్య ఆరోపణలు మానుకోవాలని, మహిళలను అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేయకుండా హుందాగా రాజకీయాలు చేయాలని హితవు పలికారు. జూన్ 4న వచ్చే ఫలితాలు ప్రజాతీర్పుగా భావించి శిరసా వహించాలన్నారు. చింతవరం నాయకుడు విష్ణువర్ధనరెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనూ, ప్రస్తుతం సిలికా వ్యాపారం చేసింది ఎవరనేది అందరికీ తెలుసన్నారు. తానే వ్యాపారం చేసి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు చిత్రీకరించడంపై మండిపడ్డారు. చింతవరాన్ని ఫ్యాక్షన్ ఏరియాగా చిత్రీకరించడం తగదన్నారు. అక్కడ అన్ని వర్గాల వారు జీవనం సాగిస్తున్నారని, చిన్న చిన్న వివాదాలు సహజమని, అలా అని ప్రతి విషయానికి తననే బాధ్యుడిని చేయడం దారుణమన్నారు. గతంలో మీ గెలుపుకోసం కష్టపడిన తనను రౌడీ షీటర్‌ను అని సంభోదించడంపై మండిపడ్డారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగితే బెదిరించి ఓట్లు వేయించుకున్నామని ఎలా అంటారని నిలదీశారు. ఎమ్మెల్యే వరప్రసాద్ ఏ కేసులో తనను కాపాడారో అర్థం కావడం లేదని, ఆయన పార్టీ మారిన తరువాత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

ఆందోళనలో మామిడి రైతులు


అంతంత మాత్రంగా ఉన్న బంగినపల్లి మామిడి

- మామిడిలో తగ్గిన కాపు
- రెండు రోజులుగా మారిన వాతావరణం
- గాలివాన కురిస్తే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన

తడ: ఈ ఏడాది మామిడి కాపు తగ్గింది. ఇందుకు గత ఏడాది డిసెంబర్‌లో ఎక్కువగా మంచు కురవడమే కారణమని అధికారులు తెలిపారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని రామాపురం, పెరియవట్టు, కారూరు, పూడి ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు మామిడి తోటలు సాగు చేస్తున్నారు. ఆయా తోటల్లో బంగినపల్లి, జవారి, రుమాని వంటి రకాలు ఉన్నాయి. ఆరంబాకం మామిడి పండ్లకు చెన్నై మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుంది. ఈ ఏడాది ఆశించినంతగా కాపు లేకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. వారం రోజుల క్రితం గాలీవాన రావడంతో కాయలు కొంతమేర రాలి పోయాయి. అది చాలదన్నట్టు రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమైంది. వాతావరణంలో మార్పులు వచ్చాయి. చినుకులు రాలుతూ ఉన్నాయి. ఇది మరింత ఉధృతమై గాలి తోడైతే చెట్లలో ఉన్న కొద్దిపాటి కాయలు కూడా రాలిపోతాయని రైతులు వాపోతున్నారు.

జోరుగా తాటి ముంజల విక్రయాలు


ముంజలను విక్రయిస్తున్న వ్యాపారి


తాటి ముంజలు కొనుగోలు చేసిన పట్టణ వాసి

చిల్లకూరు : వేసవి కాలంలో తాటి ముంజలు ఎక్కువగా కనిపిస్తాయి. వీటిలో తుమ, కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, పీచు పదార్థం, ఆమ్లం, పాస్పరస్, ఐరన్, కొవ్వు పదార్థాలు ఉంటాయి. అంతేగాక తాటి వేసవిలో డీ హైడ్రేషన్ కాకుండా కాపాడతాయి. దీంతో ఎక్కువ మంది వీటిని తినడానికి ఇష్టపడతారు. వీటికి డిమాండ్ ఎక్కువగా ఉండడంతో కొంతమంది గ్రామాల నుంచి తాటి కాయలను తీసుకువచ్చి అక్కడికక్కడే కొట్టి ముంజలు తీసి ఇస్తున్నారు. గూడూరుకు చుట్టుపక్కల ఉన్న సైదాపురం, చిల్లకూరు, గూడూరు రూరల్, మనుబోలు మండలాల్లో ఎక్కువగా తాటి చెట్లు ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల నుంచి పదుల సంఖ్యలో మహిళలు, పురుషులు తాటి ముంజలను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఒకప్పుడు పది రూపాయలకు పది ముంజలు ఇచ్చే వారు. నేడు డిమాండ్ పెరగడంతో పది రూపాయలకు మూడు ముంజలు ఇస్తున్నారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన నరసింహులు , హరికృష్ణ

డక్కిలి: వెంకటగిరి–రాపూరు జాతీయ రహదారిలోని కందలవారిపల్లి సమీపంలో శుక్రవారం బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. కందలవారిపల్లికి చెందిన నరసింహులు బైక్‌లో డక్కిలి వెళుతున్నాడు. గ్రామ సమీపంలో వెంకటగిరి నుంచి పొదలకూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న చెరువులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న నరసింహులు, కారు డ్రైవింగ్ చేస్తున్న హరికృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు వెంటనే డక్కిలి, రాపూరు ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు.

20న చలో వెంకటగిరి

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమని అంబేడ్కర్ ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా ఈ నెల 20వ తేదీన చలో వెంకటగిరి కార్యక్రమాన్ని చేపట్టినట్టు పేర్కొన్నారు. వారు శుక్రవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని తెలిపారు. ఆయన విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఈనెల 12వ తేదీ రాత్రి ధ్వంసం చేసినట్టు వాపోయారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, అదే విధంగా అంబేడ్కర్ భవన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

పాలూరు, చాగణంలో పోలీసు పికెట్

సైదాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గొడవలు జరగడంతో పాలూరు, చాగణం గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడుకోవడం కోసం గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలు గొడవలకు పాల్పడకుండా శాంతియుతంగా ఉండాలని కోరారు.